

తాళం తీయడంతో తెరుచుకున్న పార్కు గేటు

తెరుచుకున్న పబ్లిక్ పార్కు

● తాళం తొలగించిన కాలనీవాసులు

సరూర్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు సమీపంలో ఉన్న మునిసిపల్ పార్కు ప్రవేశ ద్వారానికి అల్మాస్‌గూడలోని సాయిబాలాజీ టౌన్‌షిప్ కాలనీవాసులు తాళం వేయడంపై 'పబ్లిక్ పార్కుకు ప్రైవేటు తాళం' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో గేటు తెరుచుకుంది. మునిసిపల్ అధికారుల ఆదేశంతో కాలనీవాసులు తాళం తొలగించారు. దీనిపై వాకర్స్ హర్షం వ్యక్తం చేశారు. కాలనీవాసులు పార్కుపై పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకోబోమని వాకర్స్ హెచ్చరించారు. సాయిబాలాజీ కాలనీలోని కొందరు ముఖ్య ప్రతినిధులు చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని సైతం ఆక్రమించుకున్నారని, దీనిపై తాము త్వరలో కార్యాచరణ రూపొందించుకుంటామని వాకర్స్ తెలిపారు.

డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు: డీఎస్‌ఓ

చంపాపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి డీఎస్‌ఓ యంకే రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన "గుట్టుగా సాగుతున్న గ్యాస్ సిలిండర్ల దందా" వచ్చిన వార్తకు డీఎస్‌ఓ స్పందించారు. అక్రమంగా సబ్సిడీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగంతో పాటు రీఫిల్లింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్‌ఓ తెలిపారు. ఈ సంవత్సరం జనవరి నుంచి చేపట్టిన తనిఖీలలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న వారిపై 28 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న టిఫిన్ సెంటర్లు, కిరాణ దుకాణాలపై, రీఫిల్లింగ్ చేస్తున్న వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆకస్మిక తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు డీఎస్‌ఓ తెలిపారు.



హయత్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

హయత్‌నగర్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

హయత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. బాతుల చెరువు, కుమ్మకుంట, సత్యనారాయణ కాలనీ, ఇన్ఫర్మేషన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కుమ్మరికుంట కట్టపైన రోడ్డును వేయాలని, బతుకమ్మ కొలను నిర్మించాలని, బాతుల చెరువు కట్టపై సుందరీకరణ పనులతో పాటు వాకింగ్ ట్రాకు ఏర్పాటు చేయాలని కోరారు. అభివృద్ధి విషయంలో హయత్‌నగర్ డివిజన్‌కు అధిక నిధులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ యాదయ్య, ఈఈ రమేష్‌బాబు, డీఈఈ దామోదర్‌రావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని, శానిటేషన్ డీఈఈ లావణ్య, ఎంటమాలజీ డీఈఈ రవీందర్, ఎలక్ట్రికల్ డీఈఈ పున్నా నాయక్, ఏఈ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబంధు పథకంపై ప్రత్యేక సమావేశం

● రైతుల నుంచి సూచనలు స్వీకరించిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంఘం ఆవరణలో ప్రత్యేక సభను నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుబంధు పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. బంధు పథకంపై రైతులు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశానికి ప్రత్యేక అధికారులు డిప్యూటీ రిజిస్ట్రార్, రంగారెడ్డి జిల్లా ఆడిట్ అధికారి నాగలింగం, అసిస్టెంట్ రిసిస్ట్రార్ విజయ, ఏడీఏ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి కవిత హాజరయ్యారు. 5 నుంచి 10 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని వర్తింపచేయాలని కొందరు రైతులు సూచించారు. సంఘం చైర్మన్ భరత్‌కుమార్ మాట్లాడుతూ మే, డిసెంబర్ నెలల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు మొగుళ్ల యాదిరెడ్డి, పగిళ్ల బాల్‌రెడ్డి, బిజిలి బాలనర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి ఎల్వోసీ అందజేత

సరూర్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌కు చెందిన రేణుక అనే మహిళ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయింది. చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో కార్పొరేటర్ జిల్లా సౌందర్యావిజయ్ సహకారంతో ఎమ్మెల్యే సబితారెడ్డిని కలువగా ఆమె సీఎం సహాయ నిధి నుంచి రూ. 1.20 లక్షలు మంజూరు చేయించారు. దానికి సంబంధించిన ఎల్వోసీని మంగళవారం రేణుక కుటుంబ సభ్యులకు అందజేశారు.



కవాడిపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ. 1 కోటి 22 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీపీ రేఖా, జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, ఇనాంగూడ, లష్కర్‌గూడ, కవాడిపల్లి, తారామతిపేట, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ గ్రామాల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, డీఈఈ సయ్యద్ అహ్మద్ అబ్బాస్, ఎంపీటీసీలు తాటిపల్లి సౌమ్యరమేష్‌గౌడ్, కేశెట్టి వెంకటేష్, చేగూరి వెంకటేష్, భీమగొని భాస్కర్‌గౌడ్, గ్యారల బాలలింగస్వామి, మండల కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, ఎంపీవో వినోద, ఏఈ సూర్యతేజా తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టుల ఎదురుగా నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

డీపీని తొలగించాలంటూ న్యాయవాదుల నిరసన

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో డీఓపీని తొలగించి టెన్యూర్ పీపీలని వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తు మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టుల ఎదుట న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టారు. తెలంగాణ డీపీసీని ఆపి న్యాయవాదుల హక్కులను కాపాడాలని న్యాయవాదులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 12 అమలును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ముడుపు శశికాంత్, రమేష్‌రెడ్డి, పుల్లారెడ్డి, పులిజాల సురేష్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌యాదవ్, సురేష్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్స్‌తోనే ఫ్లైఓవర్ పనులు చేట్టాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పనామ ఇరువైపుల మట్టి ఫ్లైవర్ చేపట్టకుండా.. పిల్లర్స్‌తో కూడిన ఫ్లైఓవర్ పనులు చేట్టాలనీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డిని కోరారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి మూడు ప్రధాన ప్రతిపాదనలు చేశారు. నగరానికి ప్రధాన ద్వారమైన వనస్థలిపురంలో గోడలు కట్టి ఫ్లైఓవర్లు నిర్మిస్తే అందం, శోభ పోతుందన్నారు. పిల్లర్లతో నిర్మిస్తే రోడ్డు డివైడర్ల మధ్య పచ్చని చెట్లు పెట్టడంతో మరింత అందం వస్తుందనీ, గోడతో నిర్మించే ఫ్లైఓవర్ పనులు విరమించుకోవాలన్నారు. రెండవ ప్రతిపాదనలో భాగంగా హయత్‌నగర్ రేడియో స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్ పక్కన వినాయక విగ్రహాలు చేస్తు జీవనోపాధి పొందుతున్న దాదాపు 69 కుటుంబాలకు న్యాయం చేయాలనీ కోరారు. మూడవ ప్రాతిపాదనలో భాగంగా పనామా చౌరస్తాను ఎన్టీఆర్ చౌరస్తాగా నామకరణం చేయడం జరిగిందనీ, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అక్కడ ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగిస్తున్న నేపథ్యంలో విగ్రహాన్ని తిరిగి ఎక్కడ పెట్టాలో అధికారులతో చర్చించాలనీ కోరారు. అనంతరం గణపతి రెడ్డి మాట్లాడుతూ మీరు చేసిన మూడు ప్రతిపాధనలు సంబంధిత అధికారులతో చర్చించి మట్టి గోడలతో కాకుండా పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ పనులు జరిగేవిదంగా తగు చర్యలు తప్పకుండా తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

వనస్థలిపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటిరెడ్డి అరవింద్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు ఆర్.వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిట్టు కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

● మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

చాదర్‌ఘాట్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు అవగాహన అవశ్యమని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లపై పెరుగుతున్న ట్రాఫిక్ నివారణకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ట్రాఫిక్ నియమ నిబంధనలపై కళాశాలల, పాఠశాలల విద్యార్థులకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రగతి జూనియర్ కళాశాల, ఐడీయల్ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, ఫిడ్జి జూనియర్ కళాశాల, రెసోనాన్స్ జూనియర్ కళాశాల, నారాయణ స్కూల్, అకాడమిక్ హైట్స్ స్కూల్, బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్, ఎస్ఆర్ డీజీ స్కూల్‌లతో ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఉంటే వారి కుటుంబీకులతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు వారి కుటుంబీకుల్లో ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తున్నట్లుగా గుర్తించిన వెంటనే పాటించే తీరులో వివరిస్తారని, తమ పిల్లల కోసమైనా కుటుంబీకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించే అలవాటు చేసుకుంటారన్న విశ్వాసాన్ని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వ్యక్తం చేశారు. ఎవరైనా ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేస్తుంటే వెంటనే వారిని ట్రాఫిక్ సిగ్నల్ ఉందంటూ వారి వెంట ఉన్న విద్యార్థులే హెచ్చరిస్తూ చేస్తారని ఆయన వివరించారు.



ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



మేయర్ల సదస్సులో పారిజాతారెడ్డి

జకార్తాలో అంతర్జాతీయ మేయర్ల సదస్సు

● పాల్గొన్న బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత

సరూర్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియాలోని జకార్తాలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ మేయర్ల ఫోరమ్ సదస్సులో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధిపై మేయర్లకు అవగాహన/శిక్షణ కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన మేయర్లు హాజరయ్యారు. మొదటి రోజు సదస్సులో సుస్థిర అభివృద్ధిపై పలువురు వక్తలు ప్రసంగించారని, వారి ప్రసంగాల్లోని ప్రధానాంశాలను అధ్యయనం చేసి బడంగ్‌పేట్‌లో అమలు చేసే విషయంపై నిర్ణయం తీసుకుంటామని పారిజాతారెడ్డి తెలిపారు.

సాగర్‌లో ఐదెకరాల భూమిని కేటాయించండి

● నీటి పారుదలశాఖకు శ్రీ రామచంద్ర మిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో హేర్ట్‌ఫుల్‌నెస్ యోగా శిక్షణ, ఆధ్యాత్మిక విద్యాకేంద్రానికి ఐదెకరాల భూమి కేటాయించాలని శ్రీ రామచంద్ర మిషన్ నీటిపారుదలశాఖను కోరింది. ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున పదేళ్ల కాలానికి గాను లీజుకు ఇవ్వాలని స్థానిక అధికారులకు నివేదించింది. అయితే 2012లో ప్రభుత్వ భూముల లీజులపై విడుదలైన జీవోనెం.571 ఆధారంగా ఐదెకరాలకు రూ.24.20 లక్షలను వార్షిక లీజుగా నిర్ధారించాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపగా.. స్వచ్ఛంద సేవ జాబితాలో భూమిని ఎకరానికి రూ.10 వేల చొప్పున ఏడాదికి లీజుకు ఇవ్వాలని సంస్థ నివేదించింది. దాంతో దీనిపై ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నాగార్జున సాగర్‌లో 7289 గజాల స్థలాన్ని శ్రీ రామచంద్ర మిషన్ 1980లో లీజుకు తీసుకుంది. తాజాగా మరో ఐదెకరాల స్థలం కావాలని కోరగా, దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలి: కార్పొరేటర్

వనస్థలిపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లోని ప్రధాన సమస్యలను పరిష్కరించి డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, ఇతర అధికారులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ డివిజన్‌లో పలు కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను వివరించారు. కాలనీల్లో సీసీ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలనీ కమిషనర్ దృష్టికి తీసుకవచ్చారు.

అండర్ టేకింగ్ ఇస్తే లోపాలన్నీ సరి..!

● ఇంజనీరింగ్ కాలేజీల అఫిలియేషన్లకు జేఎన్‌టీయూ లైన్ క్లియర్ ● కంప్యూటర్‌సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాదికి సీట్ల పెంపు లేనట్లే

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటినుంచి ప్రారంభం కానుండడంతో, త్వరితగతిన అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేసే పనిలో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. డెఫిషియన్సీ ఉన్న కళాశాల యాజమాన్యాలు అండర్ టేకింగ్ ఇస్తే సరిపోతుందంటూ.. సోమవారం రాత్రి వర్సిటీ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఆరునెలల్లోగా తమ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరతను అధిగమిస్తామని, లేనిపక్షంలో జేఎన్టీయూ అధికారులు చర్యలు చేపట్టవచ్చనే విధంగా రూపొందించిన ఫార్మట్‌ను సర్క్యులర్‌కు జతచేశారు.

రూ.100బాండ్ పేపర్లపై అండర్‌టేకింగ్

రూ.100ల బాండ్‌పేపర్‌పై కళాశాల చైర్మన్, సెక్రటరీల సంతకాలతో మంగళవారం సాయంత్రం 4 గంటల్లోగా అండర్‌టేకింగ్ పత్రాలను సమర్పించాలని సూచించారు. జేఎన్‌టీయూ అధికారులు ఇచ్చిన వెసులుబాటుతో ఊపిరిపీల్చుకున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు ఆగమేఘాల మీద యూనివర్సిటీకి వచ్చి అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించారు. అయితే.. వర్సిటీ అధికారులు పేర్కొన్న లోపాలను అండర్‌టేకింగ్‌లో ప్రస్తావించకుండా, కొన్ని కాలేజీల యజమాన్యాలు తమకు ఫ్యాకల్టీ కొరత అంతగా లేదంటూ సమర్పించిన అఫిడవిట్లను జేఎన్‌టీయూ అధికారులు తిరస్కరించారు. మొత్తంగా 139 కాలేజీల్లో 122 కాలేజీలకు అఫిలియేషన్ మార్గం సుగమం అయినట్లు తెలిసింది. మరో 17 కాలేజీలు సవరించిన అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించేందుకు బుధవారం వరకు గడువు కోరినట్లు తెలిసింది.

ఈ ఏడాదికి సీఎస్ఈ సీట్ల పెంపు లేనట్లే.!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) కోర్సులో సీట్ల పెంపులేనట్లేనని జేఎన్టీయూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, డిమాండ్ ఉన్న సీఎస్ఈ కోర్సుల్లో దాదాపు అన్ని కళాశాలలు ఈ ఏడాది పెద్దమొత్తంలో సీట్ల పెంపునకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. కాగా, ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించిన ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల్లో ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ప్యాకల్టీ కొరత స్పష్టంగా వెల్లడి కావడంతో సీట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకున్న కాలేజీలు, అదే సంఖ్యలో సీఎస్ఈ సీట్లను పెంచాలని చేసిన విజ్ఞప్తిని కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులు తోసిపుచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో గతేడాది ఎన్ని సీట్లు ఉన్నాయో, ఈ విద్యా సంవత్సరం కూడా అదే ఇన్‌టేక్‌తో కౌన్సెలింగ్ వెళ్లకతప్పదం లేదని కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

నీట్ పరీక్షను రద్దుచేసి..

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దుచేసి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయవిచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నీట్‌పరీక్ష నిర్వహించిన ఏజెన్సీని రద్దు చేయాలని, ప్రశ్నా పత్రాల లీకేజీలకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంపై ఇప్పటివరకు ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సీబీఐ దర్యాప్తు పేరుతో ఈ అంశాన్ని మరుగున పడేసే ప్రయత్నాలను ప్రధాని మోదీ చేస్తున్నారని జాజుల ఆరోపించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు.

రేపు విద్యాసంస్థల బంద్

నీట్‌పరీక్ష పత్రం లీకేజీ ఘటనలో కేంద్రంలోని బీజేపీ నేతల హస్తం ఉందని, అందుకే ప్రధాని మోదీ నోరు విప్పడం లేదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. నీట్‌పై జాతీయస్థాయిలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈ నెల 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ విజయ్‌భాస్కర్, విద్యార్థి సంఘాల నాయకులు తాటికొండ విక్రమ్ గౌడ్, అరుణ్, ఆజాద్, నర్సింహనాయక్, లక్ష్మణ్, శాంతికుమార్‌తోపాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి సంఘాల నాయకులు

ఆరు బస్సులు.. ఐదు ఆటోలు సీజ్..!

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తోన్న వాహనాలపై చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం నగరంలోని పలుప్రాంతాల్లో ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని మూడు, అనుమతి లేని కారణంగా ఒకటి, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేని రెండు పాఠశాలల బస్సులతో కలిపి మొత్తం ఆరు బస్సులను సీజ్ చేశారు. పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తోన్న ఐదు ఆటో రిక్షాలు, లైఫ్‌ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతోన్న ఇతర రాష్ట్రాలకు చెందిన ఓ వాహనం, మరో ఓమ్ని బస్సును సీజ్ చేసినట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చిదుర రమేష్ తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ జగన్మోహన్ సిద్ధ



డాక్టర్ జగన్మోహన్ సిద్ధ

పంజాగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అలయన్స్ ఫర్ హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, డాన్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలో జరుగనున్న రెండో ప్రపంచ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సులో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జగన్మోహన్ సిద్ధ పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈనెల 5 నుంచి 8వరకు టోక్యోలోని గాక్గెయి యూనివర్సిటీలో ఈ సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ కబడ్డీ ఆటగాళ్లలో వేగాన్ని ప్లయోమెట్రిక్ ఎక్సర్‌సైజ్ ద్వారా ఎలా పెంపొందించాలనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.

గీతంలో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఏంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్), అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ (ఏహెచ్‌ఏ)ల సంయుక్త సహకారంతో ఈ కోర్సును ప్రారంభించినట్టు కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఐ.బీ.రాజు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కోర్సు వ్యవధి రెండేళ్లు అని, 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం గీతం వెబ్‌సైట్‌ను గానీ, 9494656677 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చంపాపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కాలనీలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూధన్‌గుప్తా కోరారు. డివిజన్ పరిధిలోని ద్వారకానగర్‌కాలనీలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాని నీలా మధుసూధన్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మూడు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బిజ్జాల వేణుగుప్తా, కోశాధికారి బండారు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

చంపాపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ భూపేష్‌గుప్తా నగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్కుల పంపిణీ చేశారు. సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ హాజరై మాట్లాడుతూ కార్మికుల పిల్లలలో మట్టిలో మాణిక్యాల మాదిరిగా మంచిగా చదువుకొనే విద్యార్థులు పలువురు ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కార్మికుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆయా సంఘాల నాయకులు చెన్నారం మల్లేష్, రామస్వామి, మంతని యాదయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, సంతోష్, బుచ్చమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

ఎంపీ ఈటల కృషితో నిధులు మంజూరు

● రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం, జూలై 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎమ్మెల్యే స్థానికులతో సంప్రదింపులు లేకుండా పనామా చౌరస్తాలో నిర్మిస్తున్న అండర్ పాస్ (మట్టి పిల్లర్లు) నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఎల్బీనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేషంలో మాట్లాడారు. పనామా చౌరస్తాలో నిర్మిస్తున్న అండర్ పాస్ ప్రతిపాదన కాకుండా పిల్లర్స్‌తో కూడిన ఫ్లైఓవర్ పనులు పనులు చేపట్టాలనీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పనామా చౌరస్తాలో రీ డిజైన్ చేపట్టాలని తెలియజేశామన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ కృషితోనే రూ.125 కోట్ల నిధులను మంజూరు చేశారని, అధికారింగా ప్రకటించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, బద్దం ప్రేమ్ రెడ్డి, నాయకులు నూతి శ్రీనివాస్, నాంపల్లి రామేశ్వర్, కవిత, మంగ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పదవీ విరమణకు రూ. 2 లక్షలు ఇవ్వాలి

● సీఐటీయూ నాయకుడు నరసింహ డిమాండ్

హయత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో పనిచేస్తు రిటైర్‌మెంట్ అయ్యే ఉద్యోగులకు రూ. 2 లక్షల ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నరసింహ మాట్లాడుతూ హయత్‌నగర్ ప్రాజెక్టులో సుమారు 36 సంవత్సరాలుగా అనేక మంది ఉద్యోగులు అంగన్‌వాడీలో పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పదవీ విరమణ పొందే అంగన్‌వాడీ టీచర్‌కు రూ. 2 లక్షలు, ఆయాకి రూ. 1 లక్ష ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 10 తీసుకువచ్చి జూలై 1వ తేదీన పదవి విరమణ తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం అంగన్‌వాడీలను అర్థం చేసుకుని వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమృతమ్మ, జాకనమ్మ, అరుణ, పాపమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లకు నిధులు మంజూరు చేయండి: కార్పొరేటర్



జడ్సీ వెంకన్నకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, జులై 2 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు సైదాబాద్ డివిజన్‌లో అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్‌రెడ్డి కోరారు. మంగళవారం సౌత్ జోన్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయాల వద్ద వసతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో సీసీ, బీటీ ప్యాచ్ వర్క్ పనులు చేయాలని, ఆలయాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేయాలని ఆమె సూచించారు.